సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ၊ 3 ၊ అక్టోబర్ ၊ 2023



పేదల వైద్యుడు.. ఆదర్శనీయుడు
దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల వైద్యుడిగా పేరు పొంది, ఎందరికో ఆదర్శనీయుడిగా నిలిచారు. ఆయన పులివెందులతోపాటు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారు. - 8లో



నేరాలకు పాల్పడితే జీవితం నాశనం
ఎవరైనా నేరాలకు పాల్పడితే జీవితం నాశనమవుతుందని.. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కోల్పోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు తెలియజేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.130
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 397 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	407	510
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 141.760 కిలోలు

అన్నమయ్య నివాసంబున..
శ్రీహరి వాసము!



థీంపార్కులో శ్రీవారి ఆలయం

- ప్రారంభానికి సిద్ధమైన శ్రీవారిఆలయం
- అధ్యాత్మిక కళావేదిక ఏర్పాటు పనులు
- సుందరంగా ఉద్యానవనం

రాజంపేట : అదివో..అల్లదివో..శ్రీహరివాసము..బ్రహ్మకడిగిన పాదము..అంటూ సులువైన పదాలతో కీర్తనలు అలపించిన అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. అన్నమాచార్యుని 600 జయంత్యుత్సవాలను అప్పటి టీటీడీ పాలక మండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో నభూతో అన్న రీతిలో జరిగాయి. 108 అన్నమయ్య అడుగుల విగ్రహావిష్కరణకు విచ్చేసిన దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి సంబంధించి హామీలను ప్రకటించారు.

మహానేత మరణం తర్వాత అన్నమయ్య జన్మస్థలిలో ఉన్న అన్నమయ్య థీంపార్కు(108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతం) అభివృద్ధి ఆటకెక్కించేశారు నాటి పాలకులు.దీని గురించి పట్టించుకునేవారుకరువయ్యారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అన్నమయ్య జన్మస్థలి గురించి మరిచిపోయాయి. అప్పటి టీటీడీ పాలకమండలి తాళ్లపాక, అన్నమయ్య థీంపార్కు అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపు ఊసెత్తలేదు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి, ఇప్పటి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో మళ్లీ అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై దృష్టి సారించారు.

అన్నమయ్య ఉద్యానవనంలో 14ఏళ్ల తర్వాత మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించారు. టీటీడీ రూ.కోటికిపైగా వ్యయం చేస్తోంది. ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే దక్షిణభారత యాత్రీకులు ముందుగానే అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారిని దర్శించుకోవడం మహానందగా భావిస్తున్నారు. తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం ప్రాంతం పార్కును టీటీడీ అటవీశాఖ సిద్ధం చేసింది. ఆలయం నిర్మాణం పూర్తికావడంతో త్వరలో ప్రారంభించడానికి టీటీడీ సన్నద్ధమవుతోంది.

అన్నమయ్య విగ్రహం రాజంపేటకే తలమానికం



కడప-రేణిగుంట హైవేలోని న్యూ బోయనపల్లెలోని అన్నమయ్య ఉద్యానవనంలో ఉన్న 108 అన్నమయ్య విగ్రహం రాజంపేటకే తలమానికం. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం పూర్తయింది.ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మళ్లీ అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి అడుగుడులు పడుతున్నాయి. యాత్రీకుల సముదాయం నిర్మాణం అంశం టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళతాం.
– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

శ్రీవారి ఆలయ నిర్మాణం మహాభాగ్యం



108 అన్నమయ్య అడుగుల విగ్రహం ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది. టీటీడీ మొదటిసారిగా వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించింది. యాత్రీకులు, రాజంపేట పరిసర ప్రాంతవాసులకు ఇది ఒక మహాభాగ్యంగా భావించాలి. దివంగత సీఎం వైఎస్సార్ ఆవిష్కరించిన 108 అన్నమయ్య విగ్రహం ఇప్పుడు పర్యాటకప్రాంతంగా విరాజిల్లనుంది. అన్నమాచార్యుని సంగీత కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.
– భూమన శంకర్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ సోదరుడు, నందలూరు

బాపూజీ మార్గం అనుసరణీయం

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



కలెక్టరేట్ ఆవరణలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, తదితరులు

రాయచోటి : ప్రపంచ వ్యాప్తంగా అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహా నాయకుడు మహాత్మా గాంధీ అని, ఆయన మార్గం అనుసరణీయమని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, జిల్లా అధికారులు, వివిధ ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 200 ఏళ్లపాటు మనదేశాన్ని పరిపాలించిన ఇంగ్లాడ్ దేశ రాజధాని లండన్‌లో విన్‌స్టన్ చర్చిల్ పక్కనే గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, దీనికి కారణం ఆయన అనుసరించిన మార్గాలే అని తెలిపారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు తర్వాత జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చొరవతో కలెక్టరేట్ ఆవరణలో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌ఓ సత్యనారాయణ మాట్లాడుతూ సత్యం, అహింసలను ప్రపంచానికి చాటిన మహాత్ముడు జాతిపిత మహాత్మాగాంధీ అన్నారు. దేశ స్వాతంత్ర్యంకోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అంతకు మునుపు డీఆర్‌ఓ సత్యనారాయణ స్థానిక కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీకి జెడ్పీచైర్మన్ నివాళి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని బ్రిటీషు వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ మార్గం అందరికీ అనుసరణీయమని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. బాపూజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ వ్యక్తిత్వం, విశిష్టతల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షులు బాలయ్య, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

● వైభవం..పల్లకీ ఉత్సవం



రాయచోటిటౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.అర్చకులు స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ఉత్సవమూర్తులను అలంకరించారు.పల్లకీలో కొలువుదీర్చి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటినుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కడప ఎడ్యుకేషన్ : భవిత రిసోర్స్ పర్సన్ల (ఐఈఆర్టీ) నియామకాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన అక్టోబర్ 3, 4 తేదీల్లో ఉంటుందని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 32 భవిత రిసోర్స్ పర్సన్ల నియామకానికి సంబంధించి వారి సెల్ నంబర్లకు మేసేజ్ వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు ప్రతి సర్టిఫికెట్ 2 సెట్స్ జిరాక్స్ గెజిటెడ్‌తో అప్‌డేట్ చేయించి జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయానికి తీసుకురావాలని తెలిపారు.

నేడు ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

కడప కల్చరల్ : జిల్లా ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కడపలోని జయరాజ్ గార్డెన్స్‌లో ఫొటోగ్రఫీ వర్క్‌షాప్, ఫొటోల ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు వీర ప్రతాప్, గోటూరు నాగేంద్ర, మాదినేని నిత్య, జమాల్, గణేష్‌బాబులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ స్థాయిలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఫొటోగ్రఫీ ఫ్యాకల్టీ పోట్రియా వెంకీ హాజరై ప్రసంగిస్తారని, సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. ప్రధానంగా ఫొటోగ్రఫీలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి ఆయన వివరిస్తారని తెలిపారు.

పింఛన్ల పంపిణీ 92.02 శాతం

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లాలో పింఛన్ల పంపిణీ వేగంగా సాగుతోంది. వలంటీర్లు అర్హుల ఇంటింటికీ వెళ్లి డబ్బు ఇస్తున్నారు. మొత్తం 2,64,883 పింఛన్లకు గాను రూ 73,10,27,000 అందజేయాలి. అందులో రెండోరోజైన సోమవారం సాయంత్రానికి 2,43,746 పింఛన్లకు మొత్తం రూ 67,24,24,000 పంపిణీ చేశారు. దీంతో 92.02 శాతం నమోదైంది. త్వరగా పింఛన్ల పంపిణీ పట్ల అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



జ్యోతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న వలంటీర్ అరుణకుమారి తన క్లస్టర్ పరిధిలో ఉన్న జ్యోతి అనే మహిళకు సోమవారం తిరుపతికి వెళ్లి పింఛన్ అందించింది. జ్యోతి అనారోగ్యం కారణంగా తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నందలూరు (రాజంపేట): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు అన్నమయ్య జిల్లా పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీలో అక్టోబర్ 2న ఎస్‌జీఎఫ్, వాలీబాల్ జిల్లా జట్టును ఎంపిక చేశారన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లోని నియోజకవర్గాల నుంచి వచ్చిన జిల్లా క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చూపగా అండర్-17 బాలికల జట్టుకు మమత, మెయిన్ టీమ్‌కు, మరో విద్యార్థినీ మేరీ స్టాండ్ బైగా ఎంపికయ్యారన్నారు.వీరు ఈ నెలలోనే మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలో పాల్గొంటారని అన్నారు.

పుష్పగిరిని సందర్శించిన న్యాయమూర్తులు



పుష్పగిరిలోని లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయమూర్తులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని జిల్లా న్యాయమూర్తులు సోమవారం సందర్శించారు. కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జస్టిస్ ప్రసూన, ఎక్సైజ్ కోర్టు స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ జస్టిస్ హేమా స్రవంతి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.అనంతరం శ్రీ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందచేశారు. అనంతరం ఆదినిమ్మాయపల్లె ఆనకట్టను సందర్శించారు.

పచ్చ దీక్షల పాలి(ట్రి)క్స్!

- ఆశావహులకు కలిసివచ్చిన బాబు అరెస్టు
- పోటాపోటీ దీక్షలతో ప్రజల్లో అపహాస్యం



రాజంపేట బైపాస్‌లో ఉన్న దీక్షాశిబిరం

రాజంపేట : ఆది నుంచి వర్గరాజకీయాలకు నిలయమైన రాజంపేట తెలుగుదేశం పార్టీలో తాజాగా పచ్చదీక్షల పాలిట్రిక్స్‌కు ఆశావహులు తెరలేపారు. సోమవారం టీడీపీ వారి దీక్షల సందడి చూసి జనం నవ్వుకుంటున్నారు. తమ అధినేత స్కిల్‌స్కాంలో జైలుకు వెళ్లిన నేపథ్యంలో రాజంపేట టీడీపీ టికెట్ ఆశావహులకు దీక్షల రాజకీయాలు బాగా కలిసివచ్చాయి. దీంతో ఎటు వెళ్లాలో తెలియక తమ్ముళ్లలో బిత్తరపాటు కనిపించింది.

రాజంపేట ఆర్‌ఎస్‌రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు నిరాహారదీక్ష నిర్వహిస్తున్నారు. తన వెంట నడుస్తున్న పార్టీ క్యాడర్‌తో బాబు అరెస్టుపై హడాహుడి చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం రాజంపేట బైపాస్ రహదారిలోని తను ఏర్పాటు చేసుకున్న టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద మేడా విజయశేఖర్‌రెడ్డి కూడా ఒక దీక్షా శిబిరం ఏర్పాటుచేశారు. అలాగే రాజు విద్యాసంస్థల అధినేత చామర్తి జగన్‌మోహన్‌రాజు మన్నూరు సిఐ కార్యాలయం ఎదురుగా నిరసన దీక్షను చేపట్టారు. ఈ విధంగా వేర్వేరుగా నిరసన,నిరాహారదీక్షలను చేసుకున్నారు.

పోటీగా మరో దీక్షాశిబిరం?

ఆశావహుల మధ్య దీక్షల కుంపటి రాజుకుంది. ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న గంటా నరహరి కూడా బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా నిరాహారదీక్ష పెట్టే యోచనలో ఉన్నట్లు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. తమ పార్టీ టీడీపీతో కలిసి పనిచేయాలని తమ పార్టీ హైకమాండ్ ఆదేశించిన నేపథ్యంలో అరకొరగా ఉన్న జనసేనలు దీక్షా శిబిరాల వద్ద వెళ్లేందుకు అపోసోపాలు పడుతున్నారు. రాజంపేట టికెట్ పొత్తులో జనసేనకు ఇస్తున్న క్రమంలో తెరపైకి వచ్చిన ఆశావహులు యల్లటూరు శ్రీనువాసరాజు, అతికారి దినేష్‌లు మాత్రం పచ్చదీక్షల పాలిట్రిక్స్‌క్ దూరంగా ఉన్నారు.

మదనపల్లె టీడీపీలో మూడుముక్కలాట

మదనపల్లె : మదనపల్లె టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు అధికమయ్యాయి. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్కిల్ స్కామ్‌లో అరెస్ట్‌తో జైలులో ఉన్నప్పటికీ నాయకుల మధ్య ఐక్యత కనిపించలేదు. నిరసనలు, దీక్షలు సంఘటితంగా చేయాల్సిందిపోయి ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా మూడుముక్కలుగా చీలిపోయి ఎవరి బలాన్ని వారు ప్రదర్శించుకునే పనిలో పడ్డారు. గాంధీజీ జయంతి సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సత్యమేవ జయతే దీక్షలు ముగ్గురు నాయకుల ఆధ్వర్యంలో మూడుచోట్ల ఎడముఖం, పెడముఖంగా జరిగాయి. టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్ ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్‌లోని పార్టీ కార్యాలయం ఎదురుగా జరిగిన దీక్షలో ఆయన అనుచరులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో నీరుగట్టువారిపల్లెలోని ఓ ప్రైవేట్ స్థలంలో నిర్వహించిన దీక్షలో నేతకార్మికులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో బెంగళూరు బస్టాండులోని ఆయన కార్యాలయంలో ఆయన అనుచరులతో దీక్ష నిర్వహించారు. నాయకులు ఎవరికి వారు ఆధిపత్యం ప్రదర్శించుకునేందుకు దీక్షలు జరిపితే, కార్యకర్తలు, చోటానాయకులు ఎవరి వద్దకు వెళ్లాలో దిక్కుతోచని అయోమయస్థితిలో పడిపోయారు. టీడీపీ నాయకుల పరిస్థితి ఇలా ఉంటే.. పవన్‌కల్యాణ్ ప్రకటనతో కొత్త పొత్తును చూసి మురిసిపోతున్న జనసేన నాయకులు గంగారపురామదాస్‌చౌదరి, జంగాలశివరాం తదితరులు..టీడీపీకి మేమే దిక్కు... మమ్మల్ని విడిస్తే మీకు మనుగడ లేదనే రీతిలో వారి మధ్య వెళ్లి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. కరుడుగట్టిన టీడీపీ నాయకులు జనసేన నాయకుల ఓవర్‌యాక్షన్‌పై లోలోపల మండిపోతూ, ఖర్మకాలి పార్టీకి చేటుకాలం వచ్చింది కనుకే మాయదారి సంతను భరించాల్సి వస్తోందంటూ బహిరంగంగా పైకి చెప్పకపోయినా, తమ వారితో కలిసి ఆవేదనను పంచుకున్నారు.

శ్రామిక సంక్షేమానికి భరోసా

- ఈ-శ్రమ్ కార్డుతో దేశంలో ఎక్కడైనా లబ్ధిపొందేలా ప్రణాళిక
- క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పనుల్లో భవన నిర్మాణ కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఆధార్‌కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూఏఎస్ (యూనివర్సల్ అకౌంట్ నెంబరు)తో కూడిన ఈ-శ్రమ గుర్తింపు కార్డును అందుకునేందుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో కార్మికశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అనధికారికంగా దాదాపు ఆరు లక్షల మందికి పైగా అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. జిల్లాలో యూనియన్ల ఆధ్వర్యంలో ఈ-శ్రమ్‌కార్డుల నమోదు కోసం అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 4,57,809 మంది నమోదు చేసుకున్నారు.

అర్హులు వీరే

18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని భవన నిర్మాణ , వలస కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైన వారు, బీడి, రోలింగ్, తోలు కార్మికులు, వండ్రంగి, ఇటుక బట్టీలు, క్వారీ కార్మికులు, కూరగాయలు, పండ్ల విక్రయదారులు, వార్తాపత్రికల విక్రేతలు, రిక్షా, ఆటో కార్మికులు, కర్మశుద్ధి కార్మికులు, వీధి వర్తకులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు ఇందుకు అర్హులు.

నమోదు చేసుకునే విధానం..

ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకునే వారు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. కార్మికుని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎస్‌ఎస్‌సీ కోడ్‌తోసహా ఆధార్‌కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబరు ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీసు, గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేస్తారు. అలాగే కార్మికశాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

● అసంఘటితరంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. ఆర్థిక సాయం నేరుగా వారి అకౌంటుకు జమ చేస్తారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు

అసంఘటిత రంగంలో ఎక్కువ మంది కార్మికులు నిరక్షరాస్యులుగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉచితంగా నమోదుకు అవకాశం కల్పించారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్న వెంటనే యూఏఎన్ ఏతో కూడిన ఈ-శ్రమ కార్డును పొందవచ్చు.

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో ఈ-శ్రమ్ నమోదు వివరాలు

	వైఎస్సార్	అన్నమయ్య
అగ్రికల్చర్	215345	71664
భవన నిర్మాణం	32951	3281
అపెరల్	30079	4648
ఆటోమొబైల్	16357	3195
చిన్న కార్మికులు	10973	2593
హ్యాండీ క్రాఫ్ట్స్	10956	2015
ఎలక్ట్రానిక్స్	6349	1115
గూడ్స్ మ్యానిఫ్యాక్చరింగ్	5752	---
హెల్త్‌కేర్	5411	707
డొమెస్టిక్ అండ్ హౌస్‌హోల్డ్ వర్కర్స్	4637	1115
ఎడ్యుకేషన్	3300	666
రీటైల్	3210	628
ఆఫీసు అడ్మినిస్ట్రేషన్	2662	438
లెదర్ ఇండస్ట్రీ వర్కర్స్	2482	416
సర్వీస్	2239	136
టొబాకో ఇండస్ట్రీస్	1877	343
ప్రొఫెషనల్స్	1815	327
బ్యూటీ వెల్‌నెస్	1465	274
టూరిజం అండ్ హాస్పిటాలజీ	1455	364
జ్యువెలరీ	1128	158
ఫుడ్ ఇండస్ట్రీ	926	109
ప్రింటింగ్	632	72
మైనింగ్	517	61

అవగాహన కల్పిస్తున్నాం



భవన నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుపై అవగాహన కల్పిస్తున్నాం. యూనియన్లలోని సభ్యులకు కార్డుల నమోదు తప్పనిసరి చేశాం. ఇప్పటివరకు కార్మికులందరికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయించి కార్డులు అందజేస్తున్నాం.
– డి.దానియేల్, వైస్ ప్రెసిడెంట్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, కడప

నమోదు చేసుకోవాలి



యూఏఎన్ గుర్తింపు కార్డుల కోసం లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. దీని ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తాం. కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత కోసం, ఆర్థికసాయం కోసం ఉపయోగపడుతుంది.
– బి.శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ అధికారి

తహసీల్దార్ ప్రభుత్వానికి సరెండర్



తహసీల్దార్ సుభానీ

చాపాడు : వైఎస్సార్ జిల్లా చాపాడు మండల తహసీల్దార్ విధులు నిర్వహిస్తున్న జీఎస్ సుభానీని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని కుచ్చుపాప రెవెన్యూ పొలం పరిధిలోని సర్వే నంబర్ 33/1, 2లో 1.56 ఎకరాలు, సర్వే నంబర్ 34/4లో 0.81 ఎకరాలు, 34/5లో 0.82 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి నరహరిపురం గ్రామానికి చెందిన నందిమండలం జయరామిరెడ్డి పేరుతో ఉంది. పైన పేర్కొన్న సర్వే నంబర్లలోని 3.19 ఎకరాల భూమిని ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన ఎలాంటి ఆధారాలు లేకుండా చింతకుంట చిన్న పుల్లారెడ్డి అనే వ్యక్తి వెబ్ ల్యాండ్‌లో మార్పు చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు చేపట్టినవిచారణలో తహసీల్దారు సుభానీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించటంతో జిల్లా కలెక్టర్ వేటు వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు చేశారు. ఈయన స్థానంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న యామినిని ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



కడప స్పోర్ట్స్ : కడపలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో సోమవారం జిల్లాస్థాయి అండర్-19 పురుషుల విభాగం, సీనియర్ మహిళల విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం వేదికగా ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. సింధూరి మాట్లాడుతూ జిల్లా ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు హ్యాండ్‌బాల్ శిక్షణ క్యాంపు నిర్వహించి మెలకువలు నేర్పుతామని తెలిపారు.అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడాపోషకులు గోపి, సునీల్, సీనియర్ క్రీడాకారులు కిశోర్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై దాడి

కలకడ : యువకుడిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోన గ్రామానికి చెందిన యాలపల్లి రామక్రిష్ణ కుమారుడు నాగరాజను ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన చెంగల నాగయ్య, అతని సోదరుడు శ్రీరాములు కలిసి దాడి చేశారు. కత్తితో నాగరాజ కడుపులో పొడచడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. నాగయ్య కుమార్తె ఝాన్సీ గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నట్లు అనుమానంతో.. కోన బస్టాండ్‌లో నాగరాజను నిలదీసి అడిగి, దుర్భాషలాడారు. తిరిగి నాగరాజ ఇంటి మీదికి రాత్రి సమయంలో వెళ్లి హత్య చేయడానికి కత్తితో దాడి చేసినట్లు క్షతగాత్రుని భార్య లక్ష్మీదేవి తెలిపింది. గాయపడ్డ నాగరాజను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సోమవారం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. బాధితుడి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు అంతస్తుల భవనంపై నుంచి పడి..


మృతి చెందిన రాజేష్

రాజంపేట : పట్టణంలోని మన్నూరు తోట కల్యాణ మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనంపై నుంచి సోమవారం ఓ యువకుడు కింద పడి దుర్మరణం చెందాడు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం ఆర్.మండగిరికి చెందిన మద్దగిరి రాజేష్ (31) ఇక్కడికి వలస కూలీగా వచ్చి పనులు చేసుకునే వాడు.

ఈ నేపథ్యంలో ఆయన భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఆరు నెలల గర్భవతి. అలాగే వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతి వ్యవహారం మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరింది. కేసు నమోదు విషయంలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయని బాధిత వర్గాలు అంటున్నాయి.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె – కృష్ణపట్నం రైల్వే పట్టాలపై సోమవారం 25 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మండల పరిధిలోని బోటుమీదపల్లి దళితవాడ సమీపంలోని రైలు పట్టాలపై ఈ మృతదేహం ఉంది. మృతి చెందిన యువకుడు ఆకుపచ్చ చొక్కా, నల్లప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు మృతి చెందాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉంది. అలాగే మృతుడు స్థానికుడా కాదా అని గుర్తు పట్టాల్సి ఉంది.

పేదల వైద్యుడు.. ఆదర్శనీయుడు

- చిన్నపిల్లల హస్తవాసిగా ప్రాచుర్యం
- రాజకీయ నాయకుడిగా తనదైన పాత్ర
- నేడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి తృతీయ వర్ధంతి
- పాల్గొననున్న వైఎస్ కుటుంబ సభ్యులు


వైద్య సేవలో ఈసీ గంగిరెడ్డి (ఫైల్)

పులివెందుల : దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల వైద్యుడిగా పేరు పొంది, ఎందరికో ఆదర్శనీయుడిగా నిలిచారు. ఆయన పులివెందులతోపాటు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన హస్తవాసి తగిలితే ఎంతటి రోగమైనా ఇట్టే నయమవుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకం. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిన్నపిల్లల డాక్టర్‌గా ప్రాచుర్యం పొందారు. 1949 ఏప్రిల్ 20న ఈసీ సిద్ధారెడ్డి, తులశమ్మ దంపతులకు రెండవ సంతానంగా వేముల మండలంలోని గొల్లలగూడూరులో జన్మించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గొల్లలగూడూరు ఆర్‌సీఎం స్కూలు, 6 నుంచి 8 వరకు పులివెందుల జెడ్పీ హైస్కూలు, 9 నుంచి 10వ తరగతి వరకు వేముల జెడ్పీ హైస్కూలులో చదివారు. 10వ తరగతిలో జిల్లా టాపర్‌గా నిలిచారు. ఎంబీబీఎస్, పీడీ వారణాసిలోని బెనారస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభించారు. పులివెందులలోని శ్రీనివాస హాలు వీధిలో తన సతీమణి డాక్టర్ ఈసీ సుగుణమ్మతో కలిసి గంగిరెడ్డి ఆసుపత్రి స్థాపించి దంపతులిద్దరూ వైద్య సేవలు అందించారు. పులివెందులలోని గంగిరెడ్డి ఆసుపత్రి అంటే ఎంతో ప్రాచుర్యం పొందింది. వైద్యం చేయడమే ప్రధాన ఆశయంగా, ప్రతిఫలం ఆశించని డాక్టర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఎలాంటి రోగమైనా ఆయన చేయి పడితే నయమవుతుందని పులివెందుల ప్రాంత ప్రజల నమ్మకం. ఈ ప్రాంత ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి, పక్క జిల్లాలైన అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి కూడా వచ్చి వైద్య సేవలు పొందారు. మారుతున్న కాలాన్ని బట్టి భాకరాపురంలో అత్యాధునిక వైద్య పరికరాలతో తన కుమారుడి పేరిట దినేష్ నర్సింగ్ హోం (ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి) స్థాపించి వైద్య సేవలు అందించారు. ఈసీ గంగిరెడ్డి కుమారుడు ఈసీ దినేష్‌రెడ్డి కూడా వైద్యునిగా సేవలు అందిస్తున్నారు. ఈసీ గంగిరెడ్డి తన దగ్గరకు వచ్చే రోగుల పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలను కనబరిచేవారు. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు తపన పడేవారు. దినేష్ నర్సింగ్ హోం ద్వారా అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేశారు.

రాజకీయ ప్రస్థానం

డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 2001 నుంచి 2005 వరకు పులివెందుల మండల ప్రెసిడెంట్‌గా ప్రజలకు సేవలు అందించారు. వైఎస్ కుటుంబం పోటీ చేసే ప్రతి ఎన్నికలలోనూ ఆయన తనవంతు పాత్ర పోషించారు. ఎన్నికల సమయంలో వైఎస్ కుటుంబానికి మద్దతుగా నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. 2003 రబీ సీజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు విత్తనాలు సక్రమంగా సరఫరా చేయలేదని పులివెందుల నుంచి కడప కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు

దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి తృతీయ వర్ధంతి వేడుకలు మంగళవారం పులివెందులలో ఘనంగా జరగనున్నాయి. డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో ఉన్న డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్ వద్ద మంగళవారం ఈసీ గంగిరెడ్డి, వైఎస్ కుటుంబీకులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక భాకరాపురంలో గల దినేష్ నర్సింగ్ హోంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

మూడు వ్యవసాయ బోర్లు ధ్వంసం


ధ్వంసం అయిన బోరు మోటార్లను పరిశీలిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : తమ పొలంలోని మూడు వ్యవసాయ బోర్లు ధ్వంసం చేశారని అనుంపల్లెకు చెందిన రైతులు శిబ్యాల అనుసూయ, శిబ్యాల సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం అనుంపల్లెకు చెందిన రైతుల మామిడి తోటలో ఉన్న మూడు బోరు మోటార్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దాదాపుగా 20 వేయగా 3 బోర్లలో మాత్రమే కొద్దిపాటి నీరు పడిందని, దీంతో రోజూ రేయీ పగలు కష్టపడి నీరు పెట్టుకొని మామిడి చెట్లు పెంచుకొంటున్నామని ఆ రైతులు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన మోడం చౌడయ్య, హరిప్రసాద్‌రెడ్డిలను అనుమానితులుగా గుర్తించి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'లో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం సభ్యులు భాగస్వాములు కావాలని ఆ విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివానాయక్ అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 45 రోజుల పాటు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి.. ఆ ఇంటిలో ఎంత మంది ఉన్నారు, వారికి ఏవైనా వ్యాధులు ఉన్నాయా అని గుర్తించి 7 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 112 రకాల మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. నయం కాని జబ్బులు ఉంటే ఆరోగ్యశ్రీ ద్వారా పెద్ద హాస్పిటల్స్‌కు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 3వ తేది హబీబుల్లా వీధిలో నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, వైద్య విభాగం నగర అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నగర కమిటీ నాయకులు డాక్టర్ పవన్‌రెడ్డి, గణేష్, రమేష్ నాయక్, సింధు, సావిత్రి, బ్రాహ్మణి పాల్గొన్నారు.

రేపు గురప్పస్వామి ఆలయంలో వేలం

పోరుమామిళ్ల : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానం వద్ద తలనీలాలు, వివిధ అంగళ్లు నిర్వహించుకొనుటకు బుధవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి నరసయ్య, చైర్మన్ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. టెంకాయల అంగడికి రూ.లక్ష, వంటపాత్రలు, షామియానాలు, కూల్‌డ్రింక్ షాపు, అంగళ్లు పెట్టుకొనుటకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని వారు పేర్కొన్నారు. కొబ్బరి చిప్పలు సేకరించుటకు రూ.10 వేలు, పూలదండలు, నిమ్మకాయలు అమ్ముకొనుటకు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. పాట నిలుపుదలకు, వాయిదా వేయుటకు దేవదాయ శాఖ అధికారులకు అధికారం ఉంటుందన్నారు. కావున ఈ విషయాన్ని గమనించి వేలంపాటలో పాల్గొనాలని వారు వివరించారు.

కర్ణాటక మద్యం కేసులో నలుగురి అరెస్ట్


పట్టుకున్న నలుగురి నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది

మదనపల్లె : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎస్‌ఈబీ అధికారులు నిర్వహించిన డ్రై డే తనిఖీల్లో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. బి.కొత్తకోట మండలం నాయనబావి అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో నాయనబావి గ్రామానికి చెందిన కాటమరాజు 500 మి.లీ.పరిమాణం కలిగిన 72 రాయల్‌ఛాలెంజ్ బీర్ టిన్నులను ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అలాగే బి.కొత్తకోట మండలం డేగానిపల్లె వద్ద ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న రెండు బాక్స్‌ల కర్ణాటక మద్యంను స్వాధీన పరచుకుని గుమ్మసముద్రం గ్రామానికి చెందిన రామాంజులు(42)ను అరెస్ట్ చేశామన్నారు. తర్వాత పత్రవారిపల్లెలో దండు భాగ్యమ్మ(35) నుంచి 115 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రామసముద్రం మండలం మినికికి చెందిన రెడ్డివారి లోకనాథరెడ్డి 192 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు తరలిస్తుండగా, అరెస్ట్ చేశామన్నారు. పై నలుగురు నిందితులను మదనపల్లె మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. దాడుల్లో బీఎంపీపీ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది హరికుమార్, త్రిపురేంద్రుడు, దామోదర్, ప్రసన్నకుమార్, బాలకృష్ణ, జ్యోత్స్న, రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి ఇద్దరు ఆత్మహత్య


భాగవతమ్మ (ఫైల్)


సాలమ్మ (ఫైల్)

చిన్నమండెం : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. చిన్నమండెం మండలంలో అనారోగ్య కారణాలతో మానసిక పరిస్థితి సరిగా లేనందున భాగవతమ్మ(76) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పడమటికోన గ్రామం వర్దిరెడ్డిగారిపల్లెకు చెందిన భాగవతమ్మ గత నెల 27వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు అనేక చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ నెల 1వ తేదీ సాయంత్రం అదే గ్రామంలోని ముల్లంగి సుదర్శన్‌రెడ్డి పొలంలోని పాతబావిలో నీటిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఈ మేరకు మృతురాలి మనువడు సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

జీవితంపై విరక్తి చెంది..

గాలివీడు : మండల పరిధి గోరాన్‌చెరువు గ్రామం బండివాండ్లపల్లెకు చెందిన బండినాగిరెడ్డి భార్య బండి సాలమ్మ(45) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. భార్యభర్తల మనస్పర్థలతో ఆమె జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటికి తీశారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన ఘూజీ

ముద్దనూరు : స్థానిక ఓ ఇటుకల ఫ్యాక్టరీలో ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ కూలీ మృతి చెందాడు. సీఐ నరేష్‌బాబు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అసనూర్ ఘూజీ (34) అనే వ్యక్తి గత కొద్ది నెలలుగా ఇటుకల ఫ్యాక్టరీలో కూలీ పనులు చేస్తున్నాడు. సోమవారం ఫ్యాక్టరీలో ట్రాక్టర్ నడుపుతూ మట్టి తోలుతుండగా.. ట్రాక్టర్ బురదలో ఇరుక్కుని పోయింది. ఆ ట్రాక్టర్‌ను బయటకు తీసే ప్రయత్నంలో.. కింద పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నట్లు సమాచారం.

నేరాలకు పాల్పడితే జీవితం నాశనం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు


సమావేశంలో పాల్గొన్న ఖైదీలు

కడప అర్బన్ : ఎవరైనా నేరాలకు పాల్పడితే జీవితం నాశనమవుతుందని.. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కోల్పోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు తెలియజేశారు. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి (ఖైదీల సంక్షేమ దినోత్సవం), లాల్ బహదూర్ శాస్త్రి 119వ జయంతి వేడుకలను కడప కేంద్ర కారాగారంలో ఖైదీల సమక్షంలో ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న పనులు నేర్చుకుంటూ ఖైదీలందరూ త్వరగా మార్పు చెందాలని తెలిపారు.

జైలు నిబంధనలు పాటిస్తూ, నిబద్ధతతో శిక్షను పూర్తి చేసుకుని విడుదలై మీ కుటుంబాలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దీనాబాబు మాట్లాడుతూ గాంధీజీ చూపిన మార్గాన్ని అందరూ అలవర్చుకోవాలనీ, ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించాలన్నారు. సత్యాన్ని పలకాలని, అహింసా మార్గంలో జీవించాలని చెప్పారు. సత్ప్రవర్తనతో ఉన్నట్లయితే రెమిషన్ పొంది త్వరగా జైలు నుంచి విడుదల అవుతారన్నారు. తరువాత మంచి జీవితాన్ని జీవించాలన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ కేంద్ర కారాగారంలో తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయుటకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తామని తెలియజేశారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఖైదీలను సంస్కరించే విధానాలు, పునరావాసంకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్.ప్రకాష్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఏ.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ట్రైనీ కలెక్టర్ భరత్ తేజ్, కడప కేంద్రకారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌లు కె.జవహర్‌బాబు, ఏ. సాంబశివరావు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, గార్డింగ్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్, మెడికల్ సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయుడు సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముసలికుంట పంచాయతీ చదివేవాండ్లపల్లెకు చెందిన డేరంగుల మల్లయ్య (49), ఇదే పంచాయతీలోని బోయపల్లెకు చెందిన చిన్నవెంకట్రమణతో కలిసి సొంత పనిపై గత నెల 22న తంబళ్లపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. తంబళ్లపల్లె నుంచి తిరిగి ఇంటికి అదే రోజు రాత్రి ద్విచక్రవాహనంలో వస్తుండగా బంగ్రేవుకు సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. సంఘటనలో మల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా, చిన్న వెంకట్రమణకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన మల్లయ్యను 108లో మదనపల్లెకు తరలించారు. మెరుగైన చికిత్సల కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లయ్య సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఉంచారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నలుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన జనార్ధన్ కుమారుడు కె.భవేష్ (20) కుటుంబ సమస్యలతో సోమవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా రాచేవేటివారిపల్లె గొల్లపల్లికి చెందిన రెడ్డప్ప భార్య ఎస్.ఈశ్వరమ్మ (31) మనస్తాపం చెంది ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగింది. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ బండకిందపల్లెకు చెందిన నారాయణ కుమారుడు ఆంజనేయులు (33) కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పెద్దమండ్యం మండలం వెలిగల్లు పంచాయతీ బండమీదపల్లెకు చెందిన ఓ మైనర్ బాలిక (15) స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతోంది.

తల్లిదండ్రులు మందలించడంతో సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్‌పోస్టు సిబ్బంది ఆయా పోలీసుస్టేషన్‌లకు సమాచారం అందించడంతో కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే 'సేవ్ జర్నలిజం డే'


గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

కడప కార్పొరేషన్ : అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా 'సేవ్ జర్నలిజం డే'ను పాటిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కడప నగరంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై పలు జిల్లాల్లో దాడులు జరిగాయని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పౌరసమాజం దృష్టిలో ఉంచేందుకు, సమస్యల పరిష్కారం కోసం మనం సాగిస్తున్న ఉద్యమానికి పౌరసమాజం మద్దతు కూడగట్టేందుకు 'సేవ్ జర్నలిజం డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సి.వెంకట్‌రెడ్డి, ఐజేయూ సభ్యులు రామాంజుల్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సుబ్బరామయ్య, శ్రీనివాసులు, సర్దార్, ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్స్ ఐన్యూస్ శ్రీనివాసులు, సురేంద్ర, సీపీ రమేష్, హెచ్‌ఎంటీవీ శివ, కెమెరామెన్ సంఘం అధ్యక్షుడు శీను పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి కోసం గాలింపు


రవిశంకర్ (ఫైల్)


అటవీ ప్రాంతంలో గాలిస్తున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది

గోపవరం : మండలంలోని కాలువపల్లె పంచాయతీ లక్కవారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన బల్లిరవిశంకర్ అనే యువకుడు బర్రెల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రవిశంకర్‌కు సంబంధించిన బర్రెలు కనిపించకపోవడంతో తన అక్క, బావతో కలిసి వెతుకులాడేందుకు గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతానికి ఆదివారం వెళ్లాడు. సాయంత్రానికి అక్క, బావ తిరిగి ఇంటికి రాగా.. రవిశంకర్ మాత్రం ఇంటికి చేరుకోలేదు. దీంతో సోమవారం కుటుంబ సభ్యులు బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గానుగపెంట బీట్‌లో ముమ్మరంగా గాలించారు. ఆచూకీ కోసం డ్రోన్ కెమెరాను కూడా ఉపయోగించారు. రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో తిరుగుతూ ఆచూకీ కోసం ప్రయత్నించారు. రవిశంకర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కూడా పోలీసులకు సహకరిస్తూ అటవీ ప్రాంతంలో తిరుగుతున్నారు. సోమవారం రాత్రి వరకు కూడా యువకుడి ఆచూకీ దొరకలేదని పోలీసులు సమాచారమిచ్చారు. కాగా అదృశ్యమైన రవిశంకర్‌కు మూడు నెలల క్రితమే వివాహమైంది. బర్రెల కోసం వెళ్లి రెండు రోజులుగా తిరిగి రాకపోవడంతో భార్యతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాబు అవినీతి సొమ్మును ఖజానాకు జమ చేయాలి


పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ స్కాం ద్వారా చంద్రబాబు రూ.371 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు కుంభకోణం, అమరావతి భూముల కొనుగోలులో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఈ కేసుల్లో వేలకోట్లు అక్రమంగా సంపాదించారని, ఆ సొమ్మును ఆయన్నుంచి రాబట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్.చెన్నయ్య, ఎం.సుబ్బారెడ్డి, కె.బాబు, డివిజన్ ఇన్‌చార్జులు బండి ప్రసాద్, మేసా ప్రసాద్, వీరారెడ్డి, ఆర్వీ రమణ, కె.రాజశేఖర్‌రెడ్డి, ఏ బాలక్రిష్టారెడ్డి, త్యాగరాజు, పార్టీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, జాషువా, షఫీవుల్లా, మనోజ్, విజయకుమారి పాల్గొన్నారు.